# పేరులో ఏముంది.

'అబ్బబ్బా! ఈ దిక్కుమాలిన గడియారం యిలా వెర్రిగా తోక కోసిన నక్కలా, ఎవరో వెనకనుండి తనను తరుముకు వస్తున్నట్లు వొకటే పరుగు. కాస్త మెల్లిగా, నింపాదిగా నడిస్తే దీని సొమ్మేదో పోయినట్లు.

అవునూ యిదేం వింత ఆలోచన? దాని సొమ్ము పోతుందో పోదో అది తరువాతి విషయం. కాని ప్రస్తుతానికి మాత్రం నేనిలా కంటికి విషయమైన ప్రతి చేతనాచాతనాలను గూర్చి పట్టించుకుని వుపాలంభిస్తూ కూర్చుంటే నా పని కాస్త గుంటకొట్టి గంటవాయిస్తుంది. అంటూ నాలో నేనే అనుకున్నాను, అనే భావించాను. కానీ, నాకు తెలియకుండానే ఆ చివరి వాక్యాలు పైకి అనేసినట్టున్నాను. వున్నానేమిటీ? అన్నాను. ఈ నా మాటలు కాస్తా వెళ్లి అప్పుడే నా గదిలో ప్రవేశానికి కాలు మోపుతూ వున్న అతి వాగుడు వసపిట్ట అదే నా జిగ్రీదోస్తు సుందరి చెవిలో పడ్డట్టున్నాయి. ఆ శబ్దతరంగం అలా వెళ్లి దాని చెవిని తాకిందో లేదో అది వెంటనే స్పందిస్తూ

' ఒహో! ఏమే? అభినేత్రి? ఏమిటి కథ? ఎవరిని వుపాలంభిస్తున్నావ్! చెపుమా! ఆ మాటలు స్వగతమా? అపవార్యమా?' అంటూ తనకున్న నాటక లక్షణ పరిజ్ఞానాన్ని నా ముందు వొలకబోస్తూ ప్రవేశించింది.

ముందేపని తెమలక చిర్రుబుర్రుమంటూ రుసరుసలాడుతున్న నాకు దాని మాటలు అధిక ప్రసంగంలా కనిపిస్తూ నా అరికాలి మంటను నెత్తికెక్కించాయి. •

అప్పుడు నేను స్నేహితురాలు కదా అనే ఆప్యాయత, అనురాగం, ఆదరణలు అలా వుంచి ముక్కూ మొకమైనా చూడకుండా, వోహో! ఆదిలోనే వికట పాత్ర ప్రవేశం జరిగిందన్నమాట. అమ్మా! తల్లీ! ఓ నా మిత్రచూడామణీ!

నేను చెప్పిందీ, నీవు విన్నదీ అపవార్యమూ కాదు. ఆకాశభాషితం అంతకన్న కాదు, కానీ అప్రస్తుత ప్రశంసలా తమరి రాక మాత్రం అసంగతమై నా పనికి అడ్డుపుల్లవేస్తూ అంతరాయాన్ని సృష్టిస్తూంది' అన్నాను.

మై డియర్ డార్లింగ్! అదా? నీ బాధ! అందుకేనా? పాపం, దొరికిన గడియారాన్ని పట్టుకు దుల్పుతున్నావ్. అదేం ప్రాణవంతమైన వ్యక్తిగనకనా? నీ మాటలకు స్పందిస్తూ సమాధానం చెప్పడానికి ? సర్దుకుపోవటానికి? దానికి నిలువెల్ల కాళ్ళున్న మాట నిజమే అయినా, అది యితర్ల చేతి కీలు బొమ్మ, స్వయం ప్రతిపత్తి లేనిది కదా? మన స్త్రీ జనం మాదిరి.

అవునవును! పంచేంద్రియాలూ, పంచతన్మాత్రలన్నీ సజావుగా, సుష్టుగా వున్న నీలాంటి వ్యక్తులేదో మహా, యితర్ల కష్టాలు, సుఖాలు పట్టించుకున్నట్లు అప్రాణి వస్తువులేమో చూస్తూ వూర్కున్నట్లు ? అవే నయం, కనీసం చప్పుడు చేయకండా సహకరిస్తాయి.

'అంటే? నన్ను వెళ్లిపొమ్మనేగా? ఐ యామ్ సారీ! కృష్ణే! వెళ్లుతున్నాను' అంటూ లేచింది.

అప్పుడు నేను ' ఆ! వెళ్లుతావ్, ఎందుకు వెళ్లవ్ ? నా పని చెరిచి, నా మనస్సును కలిచి, రెంటికి చెడ్డ రేవడిని చేసి వెళ్లుతావు. ఇంతకన్నా యింకేం చేయగలవు?' అన్నాను.

'నా మాటలు విన్న వెంటనే సుందరి నన్ను ముద్దుపెట్టుకున్నంత పని చేస్తూ...

'ఓసీ! చిటపటల చిర్రుపిట్టా? ముక్కుమీద కోపమా? అప్పుడే అంత వులుకైతే ఎలా? మరీ అంత శరవేగంగ ఎత్తికోలూ, దింపుకోలు తగదు. సామాన్యులం హడలి చస్తాం! నీ అన్‌ప్రెడిక్టబుల్ మూడ్స్ ఎలా తెలుసుకోగలం చెప్పు? అందుకే వో నా ప్రాణసఖీ! కాస్త నీ చుట్టూ వుంటూ నీ శ్రేయస్సుకోరే అల్ప ప్రాణులకోసం ఆ వేడిని తగ్గించు, తరువాత కావలసినంత అమృతాన్ని వర్షిస్తావు. ఏం లాభం? అయినా వెన్నలాంటిది నీ మనస్సంటూ తెలిసినవారు నీ స్నేహాన్నే కోరుతారు.'

'హియర్, హియర్! అయిందా వుపన్యాసం. యింకా వుందా? అవునూ! నాకిన్ని పేర్లున్నట్లు తెలియదే?'

'పేర్లో ఏముంది డార్లింగ్! పేర్ల వెనుక వున్న మెటల్ లో వుంది. చేవ, స్వారస్యం, సార్థక్యం అంతా.'

'సుందరీ! ప్లీజ్ నీకు పుణ్యం వుంటుందే మహాతల్లీ! నీ భాషా పరిజ్ఞానాన్నంతా నాపై రుద్దకు'

రుద్దటం కాదే 'పేరు' అనే మాట వినగానే నా మనస్సులో వొక విద్యుత్తరంగంలా మెరిసింది.

'ఏమిటో ఆ ఝులక్?'

'నువ్వు వినుక్కోనంటే చెబుతాను. విను. ఎన్ని నాళ్లనుండో మన సాహిత్యంలో

నిత్య వ్యవహారంలో అసలు పేర్లు కాకుండా, ఎన్నో మారు పేర్లు, ముద్దు పేర్లు, కలం పేర్లు, ఎన్నో ఎన్నో వున్నాయి. నాకెందుకో వాటి స్వరూపాన్ని గూర్చి ఆలోచించి లోతులు చూడాలని వుంది.

అంటే? సుందరీ! దానిపై ఏదో పరిశోధన లాంటిది ప్రారంభించడానికి ప్రాతిపదికగా నేను దొరికా నన్న మాట.

'అవును ! నా పరిశ్రమకు భూమికగా వుపకరిస్తున్నావంటే నీ విలువేమిటో గ్రహించావా?'

'భూమికనా? ముడిసరుకునా?'

' ఏమైనా తప్పేముంది? నాప్రయోగ క్షమతకు నీవు ఆధారశిలగా వుపకరిస్తావుగా ఇంకేం కావాలి?'

'సుందరీ! ఈరోజు నీకేదో పూనకం వచ్చినట్లే వుంది. కాకపోతే ఈ పెద్దపెద్ద మాటలేంటి? బాబూ!'

'పెద్దమాటలు కావు; పేర్ల సంబంధి మాటలు. నాకెందుకో మొన్న తలవని తలంపుగా రాందేవ్ కనిపించాడు. దాదాపు పాతికేళ్ల తరువాత. గతం ఒక్కసారి స్మృతిపథంలో మెదిలించి పాపం ఆయనను 'రిసీవర్' అని 'బక యంత్రం' అని పిలిచేవాళ్లం. ఈ పేరు పెట్టింది వసుకదా? జ్ఞాపకం వుందా?

'లేకేం! అలాంటి 'నిక్‌నేమ్స్' పెట్టడంలో అది ఘటికురాలు.'

'అవును అది ఘటికురాలు. తమరేదో పచ్చపూస; అసలీ నిక్‌నేమ్స్ పర్వం స్టార్ట్ చేసింది నీవేగా?

గ్లాక్సో బేబీ, గిర్దావర్, పండగతెల్లారి లాంటి పేర్లను సృష్టించిందెవరో? కొంచెం సెలవివ్వండి.'

'అవునే! నేనే! అయితే ఏం? ఆ సందర్భాలు అలాంటివి, ఆ రామారావ్ ప్రతిపండగ తెల్లారి టంచన్‌గా రావటం, అతడికి మనవార్ధన్ లక్ష్మీబాయమ్మగారు ఫలహారాలన్నీ అప్యాయంగా వడ్డించడం, ఆయనేమో వొద్దండీ! యిప్పుడే టిఫిన్ చేసి వస్తున్నా నంటూ నఖరాలు పోవడం, అవిడగారు, పోనీ తీసుకెళ్లండి, అంటూ వొకటికి పది చేర్చి పొట్లం కట్టి మాణిక్యమ్మ చేత యిప్పించడం మన నోట్లో గడ్డ కొట్టడం జరిగేది. అందుకే ఆ పారసైట్ కనిపించినప్పుడల్లా డెరోగేటరీ గా 'పండగ తెల్లారి' అంటూ సంకేతిచుకున్నాం. తప్పేముంది?

'అయితే గ్లాక్సోబేబి ఏమిటీ?. '

'అది ఓస్ట్రిష్టిప్ శాఖకు చెందుతుందిలే. మన హాస్టల్‌కు కుమార్ వొచ్చేవాడు. గుర్తుందా? ఆయన ఎర్రగా బుగ్గ చెంపలతో వుండటమే కాకుండా నున్నగా దువ్వుకుని ఒక వైపుకు కర్ల్ తిప్పేవాడు. ఆ రూపం అచ్చం గ్లాక్సో బేబిఫుడ్ డబ్బాపై వుండే బేబిలా కన్పించేది. అందుకే అలా అన్నాను.'

'మరి మీ బావగారు రాంరెడ్డిని గిర్దావర్ అనేదానివి ఎందుకూ?'

' ఎందుకేమిటి? నాకు నచ్చక. గిర్దావర్‌లు ఎండాకాలం ఎండల్లో పొలాల వెంటపడి కొలతలు చేయాల్సి వస్తుంది. అందుకని వాళ్లు ఆ క్రాప్‌ను కాస్త పొట్టిగా మాడు కన్పించేటట్లు కత్తిరించి ఐస్ పెట్టుకునేవారు. కానీ మా సదరు బావగారికి సహజంగానే ఆ కట్ అలా వుండేది. అంత డబ్బుండి కూడా మా వారిని డబ్బుకోసం పీక్కుతినేవాడు. ఆ కసితో ఆ మహాపురుషుడికి ఆ పేరు పెట్టాను. ఫన్నీ నేమ్. నేను అమాయకురాలిని సుమా!'

'అవునవును. పాపం! అమాయకురాలివి. ఏమీ తెలియని తిక్క తల్లివి. అందుకేగా మన కాలేజీలో కూడా వెర్రిముఖాలు నీకు 'ఎడ్డితల్లి' అంటూ పేరుపెట్టి ఆకుమరుగు పిందెలా కాపాడుకునేవారు. 'నంగనాచి' అంటూ చనువుకొద్దీ స్నేహితురాలిని బిరుదులతో అలంకరించింది.

ఇంతసేపూ మాటల వలల్లో చిక్కి నా కర్తవ్యాన్నే మారిచిపోయిన నేను హఠాత్తుగా గడియారం కేసి చూసి మరింత రుసరుసలాడుతూ 'ఇంకేం కావాలి? నీవు వచ్చిన పనేదో పూర్తి చేసావుగా. అసలే లీవ్ లేక చస్తూవుంటే 'కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెరిచిందని' నా పని కాస్త అటకెక్కించి మరో సెలవుకు అర్జీపెట్టుకునేలా చేసావు. మహాతల్లీ నీకు పుణ్యముంటుంది. ఆ లెటర్ అయినా వ్రాసుకోనివ్వు' అంటూ తెచ్చికోలు కోపంతో వ్రాయడం మొదలు పెట్టాను.

ఆ మాటతో మరింత రెచ్చిపోయి సుందరి నా చేతిలోని పెన్ లాగేస్తూ 'తప్పమ్మా! తప్పు. సిక్‌గా వున్న వాళ్లు వోపిగ్గా లేచి కూర్చుని లీవ్ లెటర్ వ్రాయలేరు. రేపటి తరువాత నీ వెంటే తీసుకువెడతావ్. నీ డ్యూటీ కాన్షియస్‌నెస్ కు మెచ్చుకున్నాను గానీ, వేడి వేడి కాఫీ తాగుదాం, లే,' అంటూ తానే కిచన్‌లోకి వెళ్లి కాఫీ చేసుకుని తీసుకువచ్చింది సుందరి.

స్నేహితులం ఇద్దరం కాళ్లు చాపుకుని కాఫీ తాగుతూ మాటల్లోకి జారబడ్డాం.

సుందరి 'కృష్ణా! నవ్ బి సీరియస్! ఏదో జోక్‌గా తీసుకుని కొట్టి పారేయకు. నీబుద్ధి పాదరసం లాంటిది. ఇందాక మనం మాట్లాడిన ప్రతి మాటలో పేర్లకు సంబంధించిన ఏదో చిన్న ప్రహేళికలాంటిది నన్ను తికమక పెడ్తోంది' అన్నది.

'సుందరీ! నటించకు. మోతాదు మించితే ఏదైనా విషమిస్తుంది. నా శక్తి నీకు తెలుసు, లేని నమ్రతను నటించకు, నీకేం కావాలో? సూటిగా చెప్పు. ఇన్నేళ్ల తరువాత ఈ

పేర్ల మోజు నీకెందుకు వచ్చిందో? అవి నన్నెందుకు ఆకర్షిస్తున్నాయో నాకు తెలియదు. అయినా ఈ పేర్లలో ఏముంది?'

'బాగుందే కృష్ణ నీ ప్రశ్న. షేక్స్‌పియర్ నాటకాల్లో జూలియట్ కూడా 'వాటీజ్ ఇన్ ఎ నేమ్?' అంటూ ప్రశ్నించిందంట. అలానే నీకు సందేహం కలిగింది. పేర్లే కాదు నిక్‌నేమ్స్ కి కూడా పెద్ద చరిత్ర వుంది. 'నిక్‌నేమ్' అంటే 'ఎటిమొలాజికలీ ఎకీ నేం' 'ఎకీ' అంటే 'ఆల్సో' అనే అర్థం వున్న అడ్వర్బ్' అంటూ నిఘంటువు కన్పిస్తుంది. అంతెందుకు? మన కవుల పేర్లు చూడరాదు - శబ్దానుశాసనుడు, కవిబ్రహ్మ, శంభుదాసుడు, సర్వజ్ఞుడు, వికటకవి ఇవన్నీ వారి బిరుదనామాలు. అయినా అసలు పేర్లకన్నా ఈ పేర్లకే ప్రాముఖ్యం ఎక్కువ.

'సుందరీ! అయితే నీ దృష్టిలో ఈ మారు పేర్లు లక్షణం వల్ల కానీ, రూఢివల్ల కానీ ప్రసిద్ధిని సంతరించుకుంటాయని నీ అభిప్రాయమా? '

'కృష్ణా! అభిప్రాయం మాత్రమే కాదు. నిజం కూడా. ఇందాకటి నుంచి లీలగా ఆ పేర్ల స్వరూపం నా కళ్లముందు మెదులుతున్నా వాటికి లాక్షణికంగా నామకరణం చేయలేక పోయాను. నీవు చూడు! క్షణాల్లో విశ్లేషిస్తూ 'రూఢీ' 'లక్షణ' అంటూ రెప్పపాటులో తెల్చేశావ్'

'కృష్ణా! నాకు ఇంకో సందేహం, ఇప్పుడు మనం కవులకూ, కళాకారులకూ ప్రత్యేకంగా కొన్ని బిరుదనామాలను సంకేతించుకున్నాం. ఆ విధంగానే దేశనాయకులకూ కొన్ని పేర్లున్నాయి. అవి వారికి తప్ప మరెవ్వరికీ చెల్లవు. అట్లా కాక మనలో ఒకే పేరుతో ఇద్దరు ముగ్గురు వ్యక్తులు వున్నప్పుడు ఒకరినుండి మరొకరిని వేరు చేసి చెప్పవలసి వచ్చినపుడు ఆ వ్యక్తిలో వున్న విశిష్ట గుణాన్ని ఆధారంగా చేపట్టి సంకేతిస్తూ వుంటాం. ఉదాహరణకు ముక్కుతిమ్మన్న - ఉన్న ఇద్దరు తిమ్మన్నల్లో పొడుగాటి ముక్కున్న కారణంతో, ఒకడు మామూలు తిమ్మన్న, రెండోవాడు ముక్కు తిమ్మన్న. ఇట్లే కుంటి పాపమ్మ, సంగీతం బాల్రాజు, జునుపాల పోతరాజు, బంగ్ల బడేసావు - మీసాల ఎంకయ్య, ఇట్లే కులాలలతో, ఇంటిపేర్లతో కూడా వ్యక్తులను గుర్తిస్తుంటారు.'

'సుందరీ! ఇందాక నీవు నన్ను నంగనాచి అని ముద్దుగా పిలిచావు. అంటే నన్నుసుందరి కాదు కదా?'

'అహ్మా! ఆశ; ఆ దిశలో ఆలోచించలేదు. కాని ఆలోచించవలసిన పదమే! బహుశః ఇది శ్రీకృష్ణుని అష్టమహిషులలో ఒకతైన నాగ్నజితీ సత్యాకావచ్చు. ఈమె చాలా సౌందర్యవతి, కృష్ణుడు తన సాహసానికి ఉంకువగా దక్కించుకున్న వలపుకత్తె. - శ్రీకృష్ణుని చేత యింత చే యించీ తనకేమీ తెలియనట్లే వుంటుంది. ఆ మహాసౌందర్యరాశి. అందుకే ఆమె పేరుతో నీలాంటి చమత్కారులను 'నంగనాచీ' అంటూ పిలుస్తుంటాం.

'ఎటొచ్చీ అస్త్రాన్ని నావైపు సంధిస్తేకాని నీకు తృప్తి వుండదు కదూ!'

'అస్త్రం కాదే సఖీ! వలపు'

'ఇంకా నయం! మరుగుడు మందు అనలేదు'

'కృష్ణే! ఇట్లా మనం మాటకు మాట పెంచుకుంటూ పోతే ఒక పెద్ద 'థీసిస్' రాసేట్టు వున్నాం.

'సుందరీ! నిజంగానే ఇప్పుడు సీరియస్‌గా ఆలోచిస్తున్నాను. ఈ పేర్ల విషయం ఆలోచించనే లేదు సుమా! ఏదో వ్యక్తి జన్మిస్తాడు. వాడిని గుర్తించడానికి ఓ సంకేతం అనుకున్నాను! అంతే

కొందరి విషయంలో ఈ పేర్లు తమ సొగసునూ సార్థక్యాన్నీ గోలుపోయి వుత్త పేర్లు గానే వుండిపోతాయి. అట్లా కాకుండా కొన్ని పేర్లు బహుళార్థ సాధకాలై ప్రత్యేక చిహ్నాలుగా వుంటాయి. వ్యక్తి నామాలే కాకుండా వానివరసలను సూచించే కొన్ని పేర్లు కూడా ఆయా వ్యక్తులకు ప్రత్యేకమై ఒక మహత్తును సంతరించుకున్నాయి. ఉదాహరణకు గాంధితాత, ఇందిరమ్మ, నైటింగేల్ ఆఫ్ ఇండియా, అన్న, అంటూ చెప్పుకోవచ్చు.

'కృష్ణే! నే ననలేదే? నిన్ను తాకితే చాలు గచ్చపొద గల గలా కాయలు రాల్చినట్లు విషయాలు రాల్చుతావని. ఇలా మనం ఆలోచిస్తూ కూర్చుంటే పేర్ల పందిళ్లే పారించవచ్చు విషయానికి గట్టి భూమికే ఏర్పడింది. 'శ్రీశుభం' అంటూ ప్రారంభం చేద్దాం.।

'అదేంటి! చేద్దామంటూ వుభయవచనం పలుకుతున్నావ్?'

నీవు లేని పేరెక్కడే? అంటూ సుందరి నన్ను గట్టిగా పట్టుకుంది.

ఇద్దరం సంతోషంగా లంచ్‌కు కూర్చున్నాం.